క్లుప్తంగా

రైతుబజార్‌లో నాణ్యమైన సరకులు విక్రయించాలి



నరసింహనగర్ రైతుబజార్‌లో స్టాళ్లు పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్

సీతంపేట: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్ గురువారం నరసింహనగర్ రైతుబజార్‌లో పర్యటించారు. అన్ని స్టాళ్లు పరిశీలించారు. అన్ని రకాల కూరగాయలు వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఈవో కొండబాబును ఆదేశించారు. ఉల్లిపాయలు, టమాటాల కౌంటర్లను పరిశీలించి నాణ్యమైన, తాజా సరకులు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. బజారుకు వచ్చిన వినియోగదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు, బజారులో ఎటువంటి మౌలిక సదుపాయాలు, మెరుగైన సేవలు అవసరమో అడిగి తెలుసుకున్నారు. రైతుబజారులో ఈవో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ సురభి ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్ చాకలి గెడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మెటర్నిటీ అండ్ చైల్డ్ హెల్త్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. పండ్లు, ప్రొటీన్ పౌడర్, బాలింతలకు బేబీ టవళ్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష, డాక్టర్ సంతోష్ బాలజీ గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ప్రసవం సులువుగా అవడానికి కొన్ని వ్యాయామాలు చేసి చూపించారు. కార్యక్రమంలో 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, క్లబ్ ప్రతినిధులు శివకుమార్‌రెడ్డి, టి.సత్యశ్రీ, లక్ష్మీదేవి, హర్ష మానేపల్లి, రమణి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా బస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



ఆర్టీసీ అధికారి అప్పలనాయుడుతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

డాబాగార్డెన్స్: కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ గురువారం ద్వారకా బస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రూట్లలో తిరుగుతున్న బస్సుల సమయపాలన, సమాచార పట్టిక, టాయ్‌లెట్ల నిర్వహణ, శుభ్రత, టికెట్ బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికులకు సంబంధించి కుర్చీలు, లైట్లు, ఫ్యాన్లు, మంచినీటి సదుపాయం నిశితంగా తనిఖీ చేశారు. బస్ కాంప్లెక్స్‌లో సీసీటీవీల పనితీరు పరిశీలించారు. బస్సుల్లో శుభ్రత, ప్రయాణికుల పట్ల ఉద్యోగుల ప్రవర్తన ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ సేవలందించాలని, ఏసీ బస్సుల పరదాలు ఎప్పటికప్పుడు మార్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు, అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి పందిరి రాట

డాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ వద్ద ప్రతి ఏటా నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం పందిరి రాట వేశారు. ఈ నెల 15 నుంచి 17 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. మూడు రోజుల కార్యక్రమం గోపూజతో ప్రారంభించి, స్వామికి తులసీ దళాలతో సహస్ర నామార్చన, గాయత్రి హోమం, చిన్నారులచే కోలాటం, భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ, నామ సంకీర్తన, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు..!



51వ వార్డు మాధవధారలో సగం నిర్మించి వదిలేసిన జోన్–5 కార్యాలయ భవనం

- ముందుకు సాగని జోన్–5 కార్యాలయ భవన నిర్మాణం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్ల నిధుల మంజూరు
- కూటమి ప్రభుత్వంలో అటకెక్కిన పనులు
- మాధవధారలో మూడు శ్లాబ్‌లు వేసి వదిలేసిన అధికారులు
- స్థానికులకు కలగానే మిగిలిపోతున్న జోనల్ ఆఫీస్

మద్రిపాలెం: జీవీఎంసీ జోన్–5 కార్యాలయ భవన నిర్మాణాన్ని ఏ ముహూర్తాన మొదలుపెట్టారో గానీ.. అది పూర్తయిన పాపాన పోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీని నిర్మాణానికి గ్రహణం పట్టుకుంది. విశాఖ ఉత్తర నియోజకవర్గం పూర్తిగా, పశ్చిమలో కొన్ని వార్డులు కలిపి ప్రస్తుతం దక్షిణ నియోజకవర్గంలోని జ్ఞానాపురంలో జోన్–5 కార్యాలయం ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి వారికి అందనంత దూరంలో కార్యాలయం ఉండటమేంటనే దూరదృష్టితో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందరికీ అందుబాటులో ఉండేలా జోనల్ ఆఫీస్ నిర్మాణాలు చేపట్టాలని ఆలోచించారు. జోన్–5కు సంబంధించి 51వ వార్డు మాధవధారలో కార్యాలయ భవనం నిర్మించేదుకు తక్షణమే రూ.2 కోట్లు నిధులు మంజూరు చేశారు. వెంటనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించి పునాదులు కూడా నిర్మించారు. అనంతరం ఎన్నికలు రావడంతో ఆ పనులు అక్కడే ఆగిపోయాయి.



జోనల్ ఆఫీస్ బిల్డింగ్ ప్లాన్

నిధులు లేవంట..!

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇబ్బందులు తెలుసుకుని వారికి అందుబాటులో ఉండేలా జోనల్ కార్యాలయ నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అప్పుడు మంజూరైన నిధులతో అధికారులు ముక్కుతూ.. మూలుగుతూ ఈ ఏడాదిలో మాధవధారలో మూడు శ్లాబ్‌లు వేసి పనులను అటకెక్కించేశారు. అదేంటని అడిగితే నిధులు లేవంటున్నారు. మళ్లీ ఇప్పుడు ఇంకో రూ.2 కోట్లు నిధులు ఉంటేనే పనులు ముందుకు సాగుతాయని, వాటి మంజూరు కోసం జీవీఎంసీకి అధికారులు మొరపెట్టుకున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించి జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందాలి, ఆపై టెండర్లు పిలవాలి. ఇదంతా జరగాలంటే ఎంత సమయం పడుతుందో వేచి చూడాలి. అధికారుల చేతిలో ఉన్న పనిచేయడానికి ఎంత సమయం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా సరే ఏ పని సరిగ్గా చేయడం లేదని పలువురు ప్రజలు విసుగు చెందుతున్నారు.

సుదూరం వెళ్లలేక సతమతం

ప్రస్తుతం జోనల్ ఆఫీస్ జ్ఞానాపురంలో ఉన్న కారణంగా ఇక్కడి ప్రజలు వివిధ పనుల నిమిత్తం అంత దూరం వెళ్లలేక సతమతమవుతున్నారు. ఇంటి పన్ను, జనన, మరణ ధ్రువపత్రాలు, బిల్డింగ్ ప్లాన్లు ఇలా పలు పనుల కోసం రోజూ జోనల్ కార్యాలయానికి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో మాధవధారలోని ఆర్ అండ్ బీ జంక్షన్‌కు, ఆర్టీఏ కార్యాలయానికి, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో మాధవధార నడిబొడ్డున జోన్–5 కార్యాలయ భవనం నిర్మిస్తామని చెప్పినప్పుడు అనేక మంది స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ సర్కారు వరమిచ్చినా.. కూటమి ప్రభుత్వం ఆ సొమ్ముతో శ్లాబ్‌ల వరకు నిర్మించి అర్ధాంతరంగా పనులు నిలిపేయడం గమనార్హం. దీంతో ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వారి కల నెరవేరడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో వేచి చూడాలి. జోనల్ ఆఫీస్ అందుబాటులోకి వస్తే ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ, రెవెన్యూ, యూసీడీ వంటి విభాగాలు ప్రజలకు చేరువవుతాయి. మేయర్, జీవీఎంసీ కమిషనర్ ప్రజల ఇబ్బందులపై దృష్టి సారించి జోన్–5 కార్యాలయం త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

> **అవస్థలు తొలగించాలి**
>
> వివిధ పనుల నిమిత్తం దూరంగా ఉన్న జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయానికి వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంది. మాధవధారలో జోనల్ ఆఫీస్ భవన నిర్మాణం పూర్తికాక పోవడంతో అవస్థలు పడుతున్నాం. పాలకులు, అధికారులు స్పందించి త్వరితగతిన భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.
>
> – కె.చంద్రకళ, మద్రిపాలెం



ప్రస్తుతం భవనం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

430 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థినికి కంటి వైద్య పరీక్ష చేస్తున్న సురేష్

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 430 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్.సురేష్ నేత్ర వైద్య పరీక్షలు చేసి, వీరిలో 64 మందికి దృష్టిలోపం ఉన్నట్టు నిర్ధారించారు. 58 మందికి కళ్లద్దాలు అవసరమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంపిణీ చేస్తుందని తెలిపారు. అక్టోబరు నెలాఖరు వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తారన్నారు. హెచ్‌ఎం జయంతి రాధాకుమారి పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని ఆందోళన

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలోని శ్మశానవాటికను బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర జోనల్ ఇన్‌చార్జి పెదపెంకి శివప్రసాద్ నేతృత్వంలో బీఎస్పీ జిల్లా కమిటీ సభ్యులు గురువారం సందర్శించారు. పారిశుధ్య లోపం, రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకోవడం, ప్రవేశద్వారం అధ్వానంగా ఉండడం వంటి సమస్యలు గుర్తించారు. వాటిని కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అధికారులు పర్యటించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముందుగా శ్మశానవాటికలోని శానిటరీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.

విద్యా ప్రమాణాల సాధనకు కృషి

మురళీనగర్: ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్వ శిక్ష జిల్లా అడిషనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. 49వ వార్డు ఏఎస్సార్ నగర్‌లోని బర్మా కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస అభ్యసన స్థాయిలు సాధించేందుకు నిర్దేశించిన ప్రణాళిక తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు సాధించినప్పుడే ఉన్నత విద్యలో రాణించగలుతారన్నారు. తరగతి గదుల్లో నిర్వహిస్తున్న బోధనాభ్యసన విధానాలను పరిశీలించారు. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థుల అభ్యసన స్థాయి, వర్క్‌బుక్స్, మౌఖిక పరీక్షలను పరిశీలించారు. ఆయన అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధాలు ఇవ్వడంతో లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ కిట్ల పంపిణీపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం తినేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కె.వసంతకుమారి, ఉపాధ్యాయులు లక్ష్మి, ఆనంద్, గౌతమి, అఖిల్, నరేష్, రజని, గౌరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ చంద్రశేఖర్

‘సింహాద్రి థర్మల్ ప్లాంట్’ను సందర్శించిన డీఆర్‌ఎం



సింహాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, అధికారులు



ఎన్టీపీసీ అధికారులతో సమీక్ష సమావేశంలో డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఈడీ సమీర్‌శర్మ

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్(ఎన్టీపీసీ)ను సందర్శించారు. ఈ ప్రాంతంలోని రైల్వే సైడింగ్, ఇతర కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. రైల్వే సైడింగ్‌లో ర్యాక్‌ల నిర్వహణ, ర్యాక్‌ల రాకపోకల విషయంలో భద్రతా ప్రమాణాలపై అధికారులతో చర్చించారు. ఎన్టీపీసీ ప్రాంగణంలో రైళ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్టీపీసీ సమీపంలోని జగ్గయ్యపాలెం లెవెల్ క్రాసింగ్ వద్ద భద్రతా విధానాలను డీఆర్‌ఎం పరిశీలించారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చేయూత

తాటిచెట్లపాలెం: చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చేయూతనిచ్చేందుకు తమ బ్యాంక్ వ్యాపారాన్ని 10 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నట్లు యాక్సిస్ బ్యాంక్ వాణిజ్య గ్రూప్ అధ్యక్షుడు విజయ్ శెట్టి తెలిపారు. విశాఖలో గురువారం యాక్సిస్ బ్యాంక్ ఎవాల్వ్ సెమినార్ 10వ ఎడిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జాతీయ జీడీపీకి 4.9 శాతం, ఎగుమతుల్లో 5 శాతం వాటా యాక్సిస్ బ్యాంక్ అందిస్తోందన్నారు. గత పదేళ్లలో ఎవాల్వ్‌లో 50కి పైగా నగరాల్లో 10 వేల మంది పారిశ్రామిక వేత్తలను భాగస్వాములుగా చేశామని చెప్పారు. సెమినార్‌లో పాల్గొన్న పలువురు పారిశ్రామిక వేత్తలు మూలధనం, యాక్సెస్, డిజిటల్ పరివర్తన, ఎంఎస్‌ఎంఈలకు వృద్ధి వ్యూహాలు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సుమారు 110 మంది పారిశ్రామిక నిపుణులు, యాక్సిస్ బ్యాంక్ ఉన్నతాధికారులు ప్రశాంత్ టీఎస్, బ్రజేష్ చాహిల్, ఆశిష్‌షాలతోపాటు వివిధ పరిశ్రమలకు చెందిన ఎం.సత్యనారాయణరాజు, ఎం.రవికుమార్, అమన్ గార్గ్‌లు పాల్గొన్నారు.



యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులతో వివిధ పరిశ్రమల రిసోర్స్ పర్సన్లు

ఉద్యోగ విరమణ జీవితం సంతోషదాయకం కావాలి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ పేర్కొన్నారు. యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ డి.లక్ష్మి, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన పర్యవేక్షకురాలు వై.మంజుల, సీనియర్ అసిస్టెంట్ కె.వసంతతో పాటు మరో 12 మంది ఉద్యోగులను యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణితో కలిసి సత్కరించారు. అనంతరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ అందరి మన్ననలు పొందుతూ గ్రేడ్–1 మున్సిపల్ కమిషనర్ స్థాయిలో ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మి సేవలను ప్రభుత్వం గుర్తించి స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉద్యోగులకు సంబంధించి రూ.కోటి 39 లక్షలు పీఎఫ్ అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, యూసీడీ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రసన్నవాణి, డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ శాంతికుమారి, ఏవో అప్పలనాయుడు, ఏపీడీలు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరిస్తున్న అదనపు కమిషనర్ వర్మ తదితరులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ రామాలయం ఫీడర్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–1 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహారాణి పార్లర్ ఏరియా, శంఖువానిపాలెం, మసీదు ఏరియా, 80 ఫీట్ రోడ్, జీవీఎంసీ స్కూల్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో..

మద్రిపాలెం: జోన్–2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని కాకానినగర్, ఎన్ఏడీ, మాధవధార ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాకేతపురం, రెల్లి వీధి, వినోద్‌నగర్, విమాన్‌నగర్, కాకానినగర్, ఎస్‌వీకే నగర్, ఎన్ఏడీ, పంజాబీ దాబా ఏరియా, ఐఎన్ఎస్ డేగా ఏరియా, ఆర్టీవో ఆఫీస్ రోడ్డు, సచివాలయం ఏరియా, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్



మాట్లాడుతున్న శ్రీనివాస్

డాబాగార్డెన్స్: భవన నిర్మాణ కార్మికులకు తక్షణం వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలని విశాఖ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం సిటు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సంగతి గుర్తు చేశారు. కార్మిక శాఖ మంత్రి సుభాష్ విశాఖ విచ్చేసిన తొలిసారి నిర్వహించిన సమావేశంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి భవన నిర్మాణ కార్మికులు ఎంతో దోహదపడ్డారన్న సంగతిని గుర్తు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇంత వరకు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు కార్మికులు పెద్ద ఎత్తున ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు అందజేయాలన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే చలో విజయవాడ నిర్వహిద్దామన్నారు. కార్యక్రమంలో జి.పోలేశ్వరరావు, పి.రాజశేఖర్, శ్రీను, నర్సింగరావు, శివాజీ, లోవరాజు, సిమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కరువు



హైవేలో పద్మశ్రీ ఆస్పత్రి వద్ద రక్షణ లేని గ్రీన్‌బెల్ట్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతానికి రక్షణ కరువైంది. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం కూడలి వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా గతంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ పూర్తిగా మాయమైంది. దీంతో పచ్చదనం కనుమరుగవుతోంది. కొంతమంది ఆకతాయిలు మద్యం తాగడానికి గ్రీన్‌బెల్ట్‌ను అడ్డాగా మార్చుకున్నారు. 25, 24, 44 వార్డుల పరిధిలో గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, చిల్డ్రన్ ప్లే ఏరియా, ఫ్లవర్ గార్డెన్‌లుగా అభివృద్ధి చేసి ఆహ్లాదంగా మలిచారు. 26వ వార్డులో గ్రీన్‌బెల్ట్ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. మద్దిలపాలెం కూడలి నుంచి అటు బిర్లా జంక్షన్ వరకు ఉత్తర నియోజకవర్గ పరిధిలోని గ్రీన్‌బెల్ట్ ప్రాంతం అభివృద్ధికి నోచుకోగా.. 26వ వార్డులో గ్రీన్‌బెల్ట్ ప్రాంతం మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోందని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 26వ వార్డు కార్పొరేటర్ చొరవ తీసుకుని హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ రహదారిలో సాయికృష్ణా బార్ వద్ద ఫెన్సింగ్ మాయమైన గ్రీన్‌బెల్ట్

యూజీడీ లీకేజీతో అవస్థలు



సాయి మధుర ఎన్‌క్లేవ్ వద్ద లీకవుతున్న యూజీడీ



మధురానగర్‌లో రోడ్డుపై నిలిచిన మ్యాన్‌హోల్ మురుగు నీరు

సీతంపేట: యూజీడీల నిర్వహణ అధ్వానంగా మారింది. వార్డుల్లో పలుచోట్ల యూజీడీ మ్యాన్‌హోళ్లు లీకై మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నా.. అధికారులు చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లో సాయి మధుర ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ ముందున్న యూజీడీ మ్యాన్‌హోల్ నెలల తరబడి లీకవుతోంది. మురుగు నీరు అపార్ట్‌మెంట్ ముందు నిలిచిపోయి, నాచుపట్టి దుర్వాసన, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా రోజులుగా యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని నివాసులు కోరుతున్నారు.

సిరులతల్లికి భక్తుల పూజలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రీలక్ష్మి పూజలు గురువారం 7వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొన్న భక్తులు

అమ్మవారికి పంచామృతాభిషేకం.

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సువర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనం

శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసిన కన్యకాపరమేశ్వరి సువర్ణ వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, 8 గంటలకు ప్రత్యేక పూజలు జరపనున్నారు. 10 గంటలకు మహిళలచే సామూహిక లలితా సహస్ర నామ పారాయణ, 10.30 గంటలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.